క్లుప్తంగా

జగనన్న ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలో నిర్మాణంలో ఉన్న జగనన్న ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్ డీఈ నాగమల్లేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆదివారం సమీక్ష జరిపారు. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలపై తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఇళ్లు పూర్తయిన లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పన, పెండింగ్ బిల్లుల చెల్లింపులపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతిఒక్కరూ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేందుకు కృషి చేయాలని సూచించారు.

ముమ్మరంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు



ఆగిరిపల్లి: మండలంలోని కృష్ణవరంలోని ప్రధాన రహదారిపై సీసీ రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నట్లు సర్పంచ్ కమ్మిలి జ్యోతి రాంబాబు తెలిపారు. గత ఏడాది నవంబర్‌లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.10 లక్షలతో గ్రామంలోని రామాలయం నుంచి గ్రంథాలయం సెంటర్ వరకు 500 మీటర్లు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. గ్రంథాలయం సెంటర్ నుంచి గ్రామ సచివాలయం వరకు జెడ్పీ నిధులు రూ.10 లక్షలతో మరో 500 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం, గ్రామ సచివాలయం నుంచి తారు రోడ్డు వరకు ఎమ్మెల్యే నిధులు రూ.10 లక్షలతో మరో 500 మీటర్లతో రహదారి నిర్మాణాన్ని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సహకారంతో పూర్తి చేస్తామని తెలిపారు.

రేషన్ అక్రమ నిల్వల స్వాధీనం

తిరువూరు: తిరువూరు మండలం మునుకుళ్లలో ఆదివారం మినీ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు దాడి నిర్వహించిన అధికారులు బియ్యం తరలిస్తున్న కనకాచారి, గోపీ, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు అనే వ్యక్తులపై కేసు నమోదు చేశారని తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు.

డ్వాక్రా రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

వెల్వడం(మైలవరం): డ్వాక్రా రుణాలను సంఘం మహిళా సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ యరమల నరసింహారెడ్డి తెలిపారు. మైలవరం మండలం వెల్వడంలో మహిళా మండలి వెన్నెల గ్రామీణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం సంఘం సభ్యులకు పొదుపు, తీర్మానం పుస్తకాలు అందజేశారు.

ప్రశాంతంగా నీట్ మెడికల్ పీజీ ప్రవేశపరీక్ష

తిరువూరు: నీట్ మెడికల్ పీజీ ప్రవేశ పరీక్ష స్థానిక వాహినీ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ప్రశాంతంగా నిర్వహించారు. 133 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు తెలిపారు. టీసీఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షను నీట్ నియమించిన వైద్యాధికారులు పర్యవేక్షించారు.

భావనారుషి కల్యాణం

తిరువూరు: పద్మశాలీయుల మూలపురుషుడు భావనారుషి కల్యాణాన్ని ఆదివారం తిరువూరులో నిర్వహించారు. పద్మశాలి సామాజిక భవనంలో వేదపండితులు అరిపిరాల అప్పయ్య శాస్త్రి ఆధ్వర్యంలో భావనారుషి కల్యాణాన్ని పలువురు దంపతులు జరిపించారు. పద్మశాలీయ సంఘ అధ్యక్ష కార్యదర్శులు నాగేశ్వరరావు, రామారావు పర్యవేక్షించారు.

‘సార్’ సినిమాకు ప్రత్యేక రాయితీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ధనుష్ నటించిన ‘సార్’ సినిమా ప్రేక్షకాదరణ పొందిందని, చిత్ర సందేశాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులకు అందించాలనే ఉద్దేశంతో సినిమా ప్రదర్శనపై ప్రత్యేక రాయితీ కల్పిస్తున్నట్లు జేపీఆర్ ఫిల్మ్స్ అధినేత, సినిమా డిస్ట్రిబ్యూటర్ డాక్టర్ పవన్ కుమార్ తెలిపారు. ఆదివారం ఫిల్మ్ చాంబర్ హాల్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యలకు పాల్పడటం విచారకరమన్నారు. సార్ సినిమాలో విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య బంధాన్ని హృదయానికి హత్తుకునేలా చిత్రీకరించారన్నారు. సినిమా చూసేందుకు విద్యార్థులు ముగ్గురు కన్నా ఎక్కువ మంది థియేటర్‌కు వస్తే ఒక టికెట్ పై మరో టికెట్ ఉచితంగా అందిస్తామన్నారు. 50 మంది విద్యార్థులు ఏదైనా ఒక విద్యా సంస్థ నుంచి వస్తే ఒక టికెట్‌పై ఇద్దరికి ఉచితంగా సినిమా చూసే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కోరితే వారికోసం ప్రత్యేకంగా ఒక షో ప్రదర్శిస్తామన్నారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ‘సార్’ సినిమా ప్రదర్శిస్తున్న అన్ని థియేటర్లలో ఈ రాయితీ పొందవచ్చని తెలిపారు. వివరాలకు 97051 61908లో సంప్రదించాలన్నారు. సమావేశంలో సాయిరాం స్క్రీన్స్ ‘అధినేత వినీత్‌సాయి, సురేష్ మూవీస్ డిస్ట్రిబ్యూటర్ మేనేజర్ భగవాన్ పాల్గొన్నారు.

జోరుగా కొత్తపల్లి రోడ్డు పునర్నిర్మాణం

- నిధుల కేటాయింపునకు ఎమ్మెల్యే రక్షణనిధి చొరవ
- రూ.3.87కోట్ల జిల్లా మైనింగ్ నిధులతో పనులు
- డబుల్ రోడ్డుగా మార్పు



డబుల్ రోడ్డుగా పునర్నిర్మాణం చెందిన కొత్తపల్లి రహదారి

కొత్తపల్లి(గంపలగూడెం): గంపలగూడెం మండలంలో ప్రధాన రహదారుల్లో ఒకటిగా ఉన్న కొత్తపల్లి జెడ్పీ రహదారిలో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలకు చెందిన పలు గ్రామాలను కలిపే ఈ రహదారిని చివరి సారిగా 2012లో తారురోడ్డు నిర్మాణం గావించారు. తదుపరి ఎలాంటి మరమ్మతులు సైతం చేపట్టకపోవడంతో రహదారి పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. ఎనిమిది సంవత్సరాలుగా ఈ రోడ్డుపై రాకపోకలకు ప్రజలు నానా కష్టాలు పడ్డారు. ప్రధాన రహదారి పక్కనే ఉన్న కట్లేరులో ఏటా వర్షాకాలంలో వచ్చే వరదల కారణంగా రహదారి సైతం మునిగి కోతలకు గురవుతుండేది. దీంతో పలు చోట్ల తారురోడ్డు గజాల పొడవున పై లేయర్ కొట్టుకుపోయి మెటల్ లేచిపోవడంతో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. కొత్తపల్లి, తెలంగాణ రాష్ట్రం ఎర్రుపాలెం మండలానికి చెందిన వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు గంపలగూడెం మండల కేంద్రానికి వచ్చేందుకు ఇదే రహదారి. గంపలగూడెం మండలంలోని పలు గ్రామాల నుంచి తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జమలాపురం, వెంకటేశ్వరస్వామి ఆలయానికి వేళ్లేందుకు ఈ రహదారిపై భక్తులు ప్రయాణిస్తుంటారు.

సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే

అస్తవ్యస్తంగా ఉన్న రహదారిపై వాహనదారులు ఇబ్బందులు పడటమే కాకుండా పలుమార్లు ప్రమాదాలకు కూడా గురయ్యారు. ఈ పరిస్థితిని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ ఢిల్లీరావు 2.5 కిలో మీటర్ల పొడవున నిర్మించేందుకు అవసరమైన రూ.3.86 కోట్లను జిల్లా మైనింగ్ ఫండ్స్ నుంచి కేటాయించారు. టెండర్ పద్ధతిలో డబుల్‌రోడ్డు నిర్మాణ పనులు కేటాయించారు. వుయ్యూరుకు చెందిన కాంట్రాక్టర్ సత్యనారాయణరెడ్డి రహదారి పనులను వేగవంతంగా కొనసాగిస్తున్నారు. పూర్తిగా గుంతలమయమైన రహదారిని ముందుగా పికింగ్ చేసి, ఎనిమిది అంగుళాల మందం వెట్‌మిక్స్‌ను పరిచారు. తదుపరి మూడు అంగుళాల మందం బీటీ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. బీటీ రోడ్డు నిర్మాణం దాదాపు పూర్తి కావస్తోంది. దీనిపై ఎస్డీబీసీ లేయర్ ఏర్పాటుతో పాటు ఇరువైపులా ఒక మీటరు వెడల్పున మార్జిన్ ఏర్పాటు చేస్తారు. పనులను పంచాయతీ రాజ్ డీఈ చక్రవర్తి, ఏఈ పూర్ణచంద్రరావు పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. డబుల్ రోడ్డు నిర్మాణంలో కొత్తపల్లి రహదారి పూర్తిగా కొత్త రూపురేఖలు సంతరించుకుంది. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గుంతలమయమైన కొత్తపల్లి రహదారి (ఫైల్)



నూతనంగా నిర్మించిన రహదారిపై రోలింగ్

ఎమ్మెల్యే వసంతపై దుష్ప్రచారాన్ని ఖండించిన ఎస్సీ నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌పై ఉద్దేశ్య పూర్వకంగా సోషల్ మీడియాలో చేస్తున్న దుష్ప్రచారాన్ని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎస్సీ నాయకులు తీవ్రంగా ఖండించారు. గొల్లపూడిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజయవాడ రూరల్ మండల అధ్యక్షుడు బయ్యారపు రవి కిషోర్ మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. అది చూసి ఓర్వ లేని చంద్రబాబు కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారన్నారు. మైలవరం నియోజకవర్గంలో ఆయన అనుచరుడు దేవినేని ఉమామహేశ్వరరావు కూడా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు లభిస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక తన అనుయాయులతో సోషల్ మీడియాలో దుష్ప్రచారాన్ని చేయిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌పై బురద చల్లాలని యత్నిస్తే నియోజకవర్గంలోని 65వేల మంది ఎస్సీలు చూస్తూ ఊరుకోబోరని హెచ్చరించారు. దళిత జేఏసీ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి ప్రతాప్, కుమ్మరి నాగరాజు, మంద నోవా, నల్ల మోతు చిన్నయ్య, కోపూరు రాంబాబు, పైడూరుపాడు ఎంపీటీసీ బయ్యారపు కల్పన కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవి కిషోర్, ప్రతాప్, నాగరాజు

7నుంచి తిరుపతమ్మ ఆలయంలో బోనాలు

బొర్రగూడెం(మైలవరం): మైలవరం మండలం చంద్రగూడెం శివారు బొర్రగూడెం గ్రామంలో వేంచేసి యున్న తిరుపతమ్మ గోపయ్యస్వామి వార్ల నెల బోనాల ఉత్సవాలు మంగళవారం నుంచి శనివారం వరకు ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి మోహనరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 7న కాకినాడ వారిచే వెరైటీ బుర్రకథ, 8న రాత్రి కల్లూరు వారిచే పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి చరిత్ర, 9న రాత్రి గుడివాడ వారిచే సత్య హరిశ్చంద్ర నాటకం, 10న విజయావాడ, గుడివాడ వారిచే భక్తి పాటలు, 11న రాత్రి చంద్రగూడెం వారిచే కోలాటం కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

రేపు నెమలిలో పౌష్టికాహార స్టాల్ ఏర్పాటు

నెమలి(గంపలగూడెం): నెమలి శ్రీ వేణుగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పౌష్టికాహార స్టాల్ నిర్వహించనున్నట్లు తిరువూరు సీడీపీఓ సత్యవతి తెలిపారు. తక్కువ ఖర్చుకు ఎక్కువ పోషకాలు ఉన్న ఆహార పదార్థాల తయారీపై ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా స్టాల్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. మహిళలు ఎవరైనా పోషకాహారాన్ని తయారు చేసి స్టాల్‌లో ప్రదర్శించవచ్చని తెలిపారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): కొటికలపూడి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ప్రతినిధి ఆదివారం తెలిపారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఉదయం, సాయంత్రం రెండు పూటల గ్రామంలో పర్యటించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ విభాగాల పార్టీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్.. బాలింతలకు వరం

నెలకు 300 మంది బాలింతలకు సేవలు

నూజివీడు: మహిళలు ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు అనంతరం ఇంటికి చేరుకోవాలంటే ఆర్థిక ఇబ్బందులతో గతంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను ఏర్పాటు చేసిన నాటి నుంచి ఈ వాహనాలు బాలింతలకు వరంగా మారాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం చేయించుకున్న బాలింతలను, పుట్టిన బిడ్డను సురక్షితంగా ఇంటికి చేర్చాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా గతేడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను ప్రతి మండలానికి ఒకటి చొప్పున అందుబాటులోకి తీసుకొచ్చారు. ముఖ్యమంత్రి ప్రారంభించిన వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు బాలింతలకు విశేషమైన సేవలను అందిస్తున్నాయి. ఆధునిక సదుపాయాలతో కూడిన ఈ వాహనాలు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి బాలింతను, పుట్టిన బిడ్డను సురక్షితంగా ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ఇంటికి చేరుస్తున్నాయి. ఆస్పత్రి నుంచి 75 కిలోమీటర్ల దూరం వరకు ఈ వాహనాలలో బాలింతలు, పిల్లలు, వారితో ఉన్న వారిని ఇళ్లకు చేరుస్తున్నాయి. దీంతో వేలాది రూపాయలు కిరాయి రూపంలో పేదలకు ఆదా అవుతున్నాయి. అదే ఈ వాహనాలు లేకపోతే తాము ఇంటికి రావడానికి వేలాది రూపాయలు ట్యాక్సీలకు కిరాయి కింద చెల్లించాల్సి వచ్చేదని వారు పేర్కొంటున్నారు. రూపాయి కూడా లేకుండా ఇంటికి చేరుస్తుండడంతో పేదలకు, మధ్య తరగతి వర్గాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటోంది. పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి రాష్ట్ర ప్రభుత్వం మూడు వాహనాలను కేటాయించింది. ఈ వాహనాల ద్వారా రోజుకు 10 మంది బాలింతలను వారి ఇళ్లకు చేరుస్తున్నాయి. నెలకు మూడు వందల మంది తల్లీ బిడ్డలను సురక్షితంగా ఇంటికి చేరుస్తుండటం గమనార్హం. ప్రభుత్వ ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలను కల్పిస్తూ, వైద్యులను నియమిస్తూ బలోపేతం చేస్తూనే ఇలాంటి వాహనాలను ఏర్పాటు చేసి పేదలకు ప్రభుత్వం ఎంతగానో ఉపయోగపడుతోందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నూజివీడు ఏరియా ఆస్పత్రి నుంచి బాలింతను, బిడ్డను తీసుకెళ్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం

ఉచితంగా ఇంటికి చేరుస్తున్నారు



వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ద్వారా రోజూ 10 మంది బాలింతలను, వారి బిడ్డలను ఇళ్లకు సురక్షితంగా చేరుస్తున్నారు. ఏరియా ఆస్పత్రికి ప్రభుత్వం మూడు వాహనాలను కేటాయించింది. ప్రసవం జరిగిన అనంతరం ఆస్పత్రి నుంచి ఇంటికి ఎలాంటి ఖర్చు లేకుండా తీసుకెళ్లడం గొప్ప కార్యక్రమం. పేదలకు ఈ వాహనాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

– ఆర్.నరేంద్రసింగ్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, నూజివీడు

పూరిల్లు దగ్ధం

నూజివీడు: పట్టణంలోని రామాయమ్మరావుపేటలో శనివారం రాత్రి 11 గంటల సమయంలో అగ్ని ప్రమాదం సంభవించి పూరిల్లు దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు బత్తుల నాగేశ్వరి కూలి చేసుకుని జీవిస్తోంది. రాత్రి నిద్రకు ఉపక్రమించే క్రమంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా ఇంటిలో మంటలు చెలరేగి ఉవ్వెత్తున పైకి లేచాయి. దీంతో ఆమె ప్రాణభయంతో బయటకు పరుగెత్తుకొచ్చింది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న వస్తువులన్నీ కాలి బూడిదవ్వడంతో ఆమె కట్టుబట్టలతో మిగిలింది. ఐదు కాసుల బంగారు ఆభరణాలు, రూ.50వేల నగదు సైతం కాలి బూడిదైందని నాగేశ్వరి విలపించింది. సుమారు రూ.4లక్షల ఆస్తి నష్టం సంభవించిందని భావిస్తున్నారు. అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను ఆర్పివేసింది.



అగ్నిప్రమాదంలో కాలిపోయిన వస్తువులు

బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధుల ప్రమాణ స్వీకారం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బీసీ సంక్షేమ సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు పలువురు సంఘ ప్రతినిధులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. చిట్టినగర్‌లోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రమాణ స్వీకారోత్సవానికి పలువురు బీసీ సంక్షేమ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులుగా ముస్తఫా, ఉపాధ్యక్షులుగా పుల్లారావు, ప్రధాన కార్యదర్శి మేక వెంకటేశ్వరరావు, నగర అధ్యక్షులుగా చిప్పాడ చందు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో కనకారావు, చల్లపల్లి మోహన్‌రావు, ధనాలకోట శోభన్‌బాబు, డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నేడు ‘స్పందన’

ఎ.కొండూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ఈ స్పందనలో మండల స్థాయి అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.


గంపలగూడెంలో..

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేయచ్చని పేర్కొన్నారు.

నూజివీడులో..

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని తమ సమస్యల పరిష్కారం నిమిత్తం అర్జీలను అందజేయాలని పేర్కొన్నారు.

ఎంత మధురం.. స్నేహబంధం



సమావేశంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

తిరువూరు: 58 సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్న మిత్రులందరూ కలుసుకున్న అపూర్వ సంఘటన ఆదివారం తిరువూరులో జరిగింది. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1965లో ఎస్ఎస్ఎల్‌సీ (సెకండరీ స్కూల్ లివింగ్ సర్టిఫికెట్) చదివిన విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలు చేసి, పదవీ విరమణ పొంది, మనవళ్లు, మునిమనవళ్లతో కాలక్షేపం చేస్తున్న తరుణంలో మళ్లీ కలుసుకున్నారు. 45 మంది విద్యార్థుల్లో 13 మంది మరణించగా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి దూరప్రాంతాలతో పాటు అమెరికాలో స్థిరపడిన వారు సైతం ఈ సమావేశానికి హాజరయ్యారు.

అచ్చం పేరంటాళ్లమ్మ జాతరకు ఏర్పాట్లు

పేరంటాళ్లగుట్ట(గంపలగూడెం): వినగడప శివారు పేరంటాళ్లగుట్ట వద్ద విరాజిల్లుతున్న అచ్చం పేరంటాళ్లమ్మ ఆలయంలో మంగళ, బుధవారాల్లో జాతర నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మేచినేని నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు కొనసాగించారు. మంగళవారం ఉదయం అచ్చం పేరంటాళమ్మ అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక ఆలంకరణ, విశేష పూజలు గావిస్తారు. రాత్రికి వినగడప పెద్దకాపు ఇంటి వద్ద నుంచి గ్రామ రాశి ప్రభను ప్రారంభించి గ్రామంలోని ప్రధాన వీధుల్లో బాజాభజంత్రీలతో ఊరేగిస్తారు. బుధవారం ఉదయానికి ప్రభ ఆలయం వద్దకు చేరుకుంటుంది. తదుపరి జాతర ఉత్సవాలను నిర్వహిస్తారు. పలు మండలాల నుంచి భక్తులు ఇక్కడకు విచ్చేస్తారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ చైర్మన్ నాగమల్లేశ్వరరావు తెలిపారు.



అచ్చం పేరంటాళ్లమ్మ ఆలయం

వర్గీకరణ సాధనకు ఉద్యమాలు

ముసునూరు: ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించే వరకూ ఉద్యమాలు ఆగబోవని, కొనసాగిస్తూనే ఉంటామని ఎన్టీఆర్ జిల్లా ఎమ్మార్పీఎస్ కన్వీనర్ యండ్రాతి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో దేశ వ్యాప్తంగా జరుగుతున్న పలు కార్యక్రమాల్లో భాగంగా ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న మాదిగ సంగ్రామ పాదయాత్ర ఆదివారం చాట్రాయి మండలం సోమవరం నుంచి ముసునూరు మండలం సూరేపల్లిలో ప్రవేశించింది. మహాజన సోషలిస్ట్ పార్టీ నూజివీడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంకట వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పాదయాత్ర సూరేపల్లి నుంచి అక్కిరెడ్డిగూడెం మీదుగా చెక్కపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా సూరేపల్లి మాజీ సర్పంచ్ చల్లగుళ్ల నాగమల్లేశ్వరరావు పాదయాత్రకు సంఘీభావం పలికి, పాదయాత్రికులను అభినందించారు. కార్యక్రమాల్లో ఎమ్మార్పీఎస్ మండల కో–కన్వీనర్ డోలా ఆనంద్, కంకట బాలసుందరం, ఆరెల్లి అబ్రహాం, జయరాజు, రవి, నాగార్జున, బాబూరావు, రవికుమార్ పాల్గొన్నారు.



సూరేపల్లికి చేరుకున్న మాదిగ సంగ్రామ పాదయాత్ర

వేగంగా భవన నిర్మాణ పనులు

ఆగిరిపల్లి: మండలంలోని కృష్ణవరం ప్రభుత్వ కార్యాలయాలైన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్ర భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన వికేంద్రీకరణతో ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరించేందుకు గ్రామ సచివాలయం భవనం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ సెంటర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం భవనాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. సచివాలయం రూ.40 లక్షలు, రైతు భరోసా కేంద్రం నిర్మాణానికి రూ.21.80 లక్షలు ప్రభుత్వం కేటాయించింది. మరో 10 శాతం మాత్రమే పనులు మిగిలి ఉన్నాయి. త్వరలోనే నిర్మాణ పనులు పూర్తి చేసి సచివాలయం నుంచి ప్రభుత్వ సేవలు అందిస్తామని సర్పంచ్ తెలిపారు.



కృష్ణవరంలో తుది దశకు చేరుకున్న సచివాలయం, ఆర్బీకే భవనం

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి

నూజివీడు: విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించాలని ఏపీసీపీడీసీఎల్ నూజివీడు ఈఈ డీ కృష్ణనాయక్ ఆదివారం తెలిపారు. బిల్లులను సకాలంలో చెల్లించడం ద్వారా విద్యుత్ సంస్థ అభివృద్ధికి, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు దోహదపడినవారవుతారని పేర్కొన్నారు. బిల్లులను సంస్థ ఏర్పాటు చేసిన కలెక్షన్ సెంటర్‌కు వెళ్లి గాని, గూగుల్ పే, ఫోన్ పే, ఏపీసీపీడీసీఎల్ యాప్ ద్వారా, ఇతర యూపీఐ పేమెంట్ల ద్వారా చెల్లించవచ్చని తెలిపారు. ఎస్సీ ఎస్టీ విద్యుత్ వినియోగదారులు నెలకు 200 యూనిట్ల కంటే ఎక్కువ యూనిట్లను ఉపయోగించే వారికి రాయితీ వర్తించదని, వారు తప్పనిసరిగా విద్యుత్ బిల్లు చెల్లించాలని పేర్కొన్నారు. 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను వినియోగిస్తే ప్రభుత్వం కల్పించిన రాయితీ సదుపాయం వర్తిస్తాయని తెలిపారు.

నూతన ఆవిష్కరణలతో దేశ భవిష్యత్తు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): దేశ భవిష్యత్తుకు నూతన ఆవిష్కరణలు దోహదపడతాయని రాకేష్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎన్వీ రావు పేర్కొన్నారు. నగరంలో ఈ నెల 2 నుంచి 4 వరకు ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ చూపిన ‘రాకేష్’ విద్యార్థులకు ఆదివారం పాఠశాల ఆవరణలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఎన్వీ రావు మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్‌లో రాకేష్ స్కూల్ విద్యార్థులు దేశానికి ఉపయోగపడే పలు అంశాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారన్నారు. వాహనాలు నడిపేటప్పుడు నిద్ర వస్తే అప్రమత్తం చేసే పరికరం, పర్యావరణ పరిరక్షణ, దేశ రక్షణ రంగంలో కీలకమైన ఆర్మీ జవాన్లకు ఉపయోగపడే పరికరం, వృథాగా పడి ఉన్న ప్లాస్టిక్ నుంచి పెట్రోల్, గ్యాస్ తయారీ పరికరాన్ని ప్రదర్శించారన్నారు. వీటిపై కలెక్టర్ ఢిల్లీరావు ఆకర్షితులై విద్యార్థులను అభినందించారన్నారు. సైన్స్ ఫెయిర్‌లో ద్వితీయ బహుమతి సాధించిన వెంకటరమణ, సీహెచ్ వెంకటరమణ, కె.అఖిల్ బృందానికి అమెరికాకు చెందిన వెల్ ఫర్ గో ఉపాధ్యక్షులు ఉదయ్‌కిరణ్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గైడ్ టీచర్ మల్లీశ్వరి, ఎస్.కాంతికల్పన తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎన్వీ రావు ఉదయ్‌కిరణ్ తదితరులు